రేషన్‌లో కందిపప్పు ఏదీ?

- రేషన్ దుకాణాల్లో బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ
- బహిరంగ మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరల మోత
- మండుతున్న పప్పులు, వంట నూనె ధరలు
- పేద, మధ్య తరగతి ప్రజలు సతమతం

నగరి: ప్రజలు నిత్యం వాడే సరుకుల్లో కందిపప్పు ఒకటి. కందిపప్పు ధర ఆకాశాన్నంటినప్పటికీ ప్రతి ఇంట్లో వారంలో రెండు నుంచి మూడు రోజులకు ఒకసారి కందిపప్పు వాడాల్సిందే. అలాంటి నిత్యావసర సరకును గత ప్రభుత్వం పేదలకు ప్రతి నెలా రేషన్ వాహనాల ద్వారా సరఫరా చేసేది. ఆ తరువాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటికీ రేషన్ దుకాణాల్లో కందిపప్పు పంపిణీ చేయట్లేదు. లబ్ధిదారులు అడిగిన ప్రతిసారి వచ్చే నెల వస్తుందని డీలర్లు చెప్పడం తప్ప వచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. అసలు ఎప్పుడు అందుబాటులోకి తెస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

కందిపప్పు కిలో రూ.140

నియోజకవర్గంలో నగరి, పుత్తూరు, విజయపురం, వడమాలపేట, నిండ్ర మండలాలు ఉన్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కందిపప్పు కిలోధర రూ.100 నుంచి రూ.140 వరకు ఉంది. పేద మధ్య తరగతి ప్రజలు కందిపప్పు కొనలేని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం సరఫరా చేసిన విధంగా ప్రతికార్డుకు కిలో కందిపప్పు అందించాలని పలువురు కోరుతున్నారు. కందిపప్పు సరఫరాపై కార్డుదారులు డీలర్ల వద్ద వాకబు చేస్తున్నా సరైన సమాధానం లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు కార్డుదారులు బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తే ఏం చేసుకోవాలి? కుటుంబానికి సరిపడా కందిపప్పు, వంట నూనె ఇతర నిత్యావసర సరుకులు అందించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు పేద, మధ్య ప్రజలు ఆవేదనను పరిగణలోకి తీసుకుని రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, వంట నూనె సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.


కందిపప్పు ప్యాకెట్లు

కందిపప్పు సరఫరా చేయాలి..


గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ప్రతి కార్డుదారుడికీ కందిపప్పు అందించాలి. గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు పేద మధ్య తరగతి వారే ఉన్నారు. బయట మార్కెట్లో కందిపప్పు రూ.100 నుంచి రూ.140 వరకు అమ్ముతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. రేషన్ దుకాణాల్లో కందిపప్పు అందించాలి.
–గోవర్ధన్, గుండ్రాజుకుప్పం దళితవాడ, నగరి మండలం

గతంలో రేషన్‌షాపుల్లోనే ఇచ్చేవారు..


గత ప్రభుత్వం రేషన్ షాపుల్లోనే కందిపప్పు అందించేది. అది పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడేది. ప్రస్తుతం కందిపప్పు అందించడం లేదు. బయట అమ్మే ధరలకు కొనలేకపోతున్నాం.
–కైలాసం, నిండ్ర మండలం

క్లుప్తంగా

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు


విశ్వకర్మకు ప్రత్యేక పూజలు

పుత్తూరు: పట్టణంలోని శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూజలు, అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆలయానికి వైర్‌లెస్ మైక్‌సెట్‌ను లోకేష్ హనీ వితరణగా అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వీకే మురళి, ఈశ్వరాచారి, మోహనాచారి, రవి, వాసు, గురు, ప్రసాద్, హరి పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న నేతలు

నగరి: ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదినం సందర్భంగా పట్టణ పరిధిలోని బీజేపీ నాయకులు బుధవారం ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం చేశారు. గర్భిణులకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలకం ఈశ్వరప్రసాద్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, రాష్ట్ర సభ్యులు వేలాయుధం, నగరి నియోజకవర్గ క్రియాశీల కార్యదర్శి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లిలో వెలసిన శ్రీఆరిమాని గంగమ్మ నవరాత్రి వార్షిక బ్రహ్మోత్సవ కరపత్రాలను ఆలయ చైర్మన్, ధర్మకర్త లింగారెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఆయన మట్లాడుతూ ప్రతి సంవత్సరం పాయికట్టు ప్రజలు, ఉభయదారుల సహకారంతో నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి


పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యులు

శ్రీరంగరాజపురం: పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరని మండల పశువైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. ఆమె మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా గాలికుంటు వ్యాధి సోకిన పశువులు ఉచితంగా ఇంటి వద్దనే చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తుంగమిట్ట, ఎగువ మెదవాడ, కొత్తపల్లి బీసీ కాలనీ పశువులకు ఉచితంగా 230 టీకాలు వేసినట్లు వివరించారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి మేలు


పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీ కవిత

శ్రీరంగరాజపురం: ప్రకృతి వ్యవసాయమే ఆరోగ్యానికి మేలు అని నగరి ఏడీ కవిత అన్నారు. మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామంలో సుభాష్ పాలేకర్ పద్ధతిలో పృథ్వీ మిత్ర రైతు సంఘం సభ్యులు గోపాల్‌నాయుడు పండిస్తున్న మిశ్రమ పంటలను కవిత పరిశీలించారు. కార్యక్రమానికి మండల వ్యవసాయధికారి కుసుమ, రైతులు దేవరాజ్, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

25వ తేదీలోపు ఈకేవైసీ చేయించండి


మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ మల్లికార్జున

బంగారుపాళెం: ఉపాధి హామీ పథకం వేతనదారులకు ఈనెల 25వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేయించాలని డ్వామా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ మల్లికార్జున అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ భవనంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పథకానికి సంబంధించిన వివిధ అంశాల గురించి సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. పనుల పురోగతికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఏపీఓ దినకర్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని ఐటీఐ(పారిశ్రామిక శిక్షణ సంస్థ)లో ఖాళీగా ఉన్న వివిధ రకాల ట్రేడ్లకు సంబంధించి నాలుగో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ సుబ్రమణ్యం బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 28 మధ్యాహ్నం 2 గంటల్లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకొచ్చి వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. 29న ఉదయం 10 గంటలకు ఐటీఐలో జరిగే ఇటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులకు ఎలాంటి కాల్ లెటర్లు పంపేదిలేదని స్పష్టం చేశారు.

విజయపురం ఎంపీపీ రాజీనామా


రాజీనామా పత్రాన్ని సీఈఓకు ఇస్తున్న జమున

విజయపురం: విజయపురం ఎంపీపీ జమున తన పదవికీ రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రాజీనామా పత్రాన్ని చిత్తూరు జిల్లా సీఈఓకు సోమవారం అందజేశారు. అనారోగ్య కారణంగా ఆమె రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

డివిజన్ స్థాయి క్రీడాకారుల ఎంపిక


డివిజన్ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

పుత్తూరు: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలు మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. బుధవారం అండర్–14, అండర్–17 బాలబాలికలకు మండల స్థాయి ఖో–ఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన జట్ల నుంచి డివిజన్ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక చేశారు.

పోషణ మా విజయవంతం చేయాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ మా కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కార్వేటినగరం సీడీపీఓ శోభారాణి సూచించారు. మండలంలో బుధవారం బాలింతలు, ఆరోగ్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 16 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా మండల స్థాయి పోటీలు


పరుగు పందెంలో విద్యార్థులు

నగరి: మండలస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని కేవీకే మైదానంలో విద్యార్థులకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం ఈ పోటీలను ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మండల క్రీడా కమిటీ కన్వీనర్ మణి, పీడీ సురేష్‌ల నేతృత్వంలో పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు శ్యామలాదేవి కేవీకే నిర్వాహకులు బాబు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.


షాట్‌పుట్‌లో విద్యార్థులు

రైతులు యూరియా మోతాదును తగ్గించాలి


పొలంబడిలో మాట్లాడుతున్న కవిత

పాలసముద్రం: రైతులు పంటలకు యురియా మోతాదుని తగ్గించాలని నగరి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కవిత తెలిపారు. ఆమె బుధవారం మండలంలోని బాలక్రిష్ణాపురంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కవిత నానో యూరియా, డీఏపీ వాడాలని సూచించారు. భూసార పరీక్ష ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. రైతు సేవా కేంద్ర సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించండి

నిండ్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి సంధ్య సౌందర్య అన్నారు. బుధవారం కొప్పేడు గ్రామంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మట్లాడుతూ నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అక్టోబర్ 15వ తేదీ వరకు వేస్తారని అన్నారు. ఆవులకు పాలు తగ్గడం, జర్వం, చొంగకారడం, కుంటడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యసేవలు అందించాలని కోరారు.

శుభదిన్ తిథి ఏర్పాటు గొప్ప ఆలోచన


భోజనం వడ్డిస్తున్న దాతలు

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల్లో శుభదిన్ తిథి పేరుతో దాతల ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు పలు సౌకర్యాలను అందించడం గొప్ప ఆలోచన అని ఆ పాఠశాల హెచ్‌ఎం నాథమునిరెడ్డి అన్నారు. డీఎం పురం ఉన్నత పాఠశాలలో బుధవారం దాతల ద్వారా శుభదిన్ తిథిలో భాగంగా మధ్యాహ్నం విందు భోజనం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం నాథమునిరెడ్డి రూ.3,500 విలువ చేసే వస్తువును పాఠశాలకు వితరణ చేశారు.

ఘనంగా శబరియాత్ర పూజలు


భజనలు చేస్తున్న భక్తులు

నగరి: పట్టణ పరిధిలోని బైపాస్ మలుపు వద్ద గల అయ్యప్ప ఆలయంలో బుధవారం శబరి యాత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో అలంకరించారు. ఆయంలో అయ్యప్ప భజనలు మారుమోగాయి. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎస్సార్‌పురం ఎంపీడీఓగా వనజ

శ్రీరంగరాజపురం: మండల నూతన ఎంపీడీఓగా వనజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా తిరుపతి జిల్లా నారాయణవనం ఏఓగా పనిచేస్తున్న వనజ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


తిరుమల ఆలయం వెలుపల మాజీ మంత్రి ఆర్కే రోజా, నటి రవళి

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మాజీ మంత్రి ఆర్కే రోజా, సినీనటి రవళి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించకుంటే చర్యలు

- సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ హెచ్చరిక


ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సతీష్

పాలసముద్రం: గ్రామ సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఎంపీడీఓ సతీష్ హెచ్చరించారు. బుధవారం సాక్షి పత్రికలో 'నరసింహాపురంలో మూతబడిన సచివాలయం తలుపులు' శీర్షికతో ప్రచురించిన కథనంపై ఎంపీడీఓ స్పందించారు. ఆ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. 11 గంటలైనా ఉద్యోగులు సచివాలయానికి రాకపోతే ప్రజా సమస్యలు ఎవరు తెలుసుకుంటారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఫిర్యాదులు వచ్చినా, సిబ్బంది సమయపాలన పాటించకపోయినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈఓఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

భారీ వర్షాలతో రాకపోకలకు అవస్థలు


మహదేవపురం వంకలో చెట్లను తొలగిస్తున్న ఎస్‌ఐ చిన్న రెడ్డెప్ప

పాలసముద్రం: మండల పరిధిలో మంగళవారం రాత్రి భారీ వర్షాలు కురవడంతో చిత్తూరు– బలిజ కండ్రిగ జాతీయ రహదారిపై రాకపోకలకు ప్రయాణికులు, ప్రజలు అవస్థలు పడ్డారు. మండలంలోని మహదేవపురం వంకలో వర్షపునీరు ఉధృతం కావడంతో పెద్ద పెద్ద చెట్లు వర్షపు నీటిలో కొట్టుకొచ్చి వంకలో వస్తున్న నీటికి అడ్డంగా పడిపోయాయి. దీంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప మహదేవపురం వంకలో వర్షపునీటికి అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు.దీంతో నీటి ఉధృతి తక్కువ కావడంతో రాకపోకలు సాగిపోయాయి.

స్వస్త్ నారీ సశక్తి పరివార్ వైద్యసేవలు


వైద్యపరీక్షలపై అవగాహన ఇస్తున్న వైద్యాధికారి.


విజయపురం: మాట్లాడుతున్న డాక్టర్ విష్ణుప్రియ.


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నిండ్ర: మండలంలోని ఇరుగువాయి గ్రామంలో బుధవారం స్వస్త్ నారీ సశక్తి పరివార్ వైద్యసేవలు నిర్వహించారు. శిబిరంలో మహిళలకు వైద్యపరీక్షలు చేశారు. కుటుంబం అంతా ఆరోగ్యంగా వుండాలనే పథకం అమలు చేస్తున్నట్లు వైద్యాధికారి తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం

విజయపురం: వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని పీహెచ్‌సీ డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. స్వస్త్ నారీ సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జగన్నాథపురం సచివాలయ ఆవరణలో శిబిరం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ కుటుంబంలో స్త్రీ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, గర్భదారణ, ప్రసవం, ప్రసవానంతర జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించారు. అలాగే రక్తహీనత నివారణ, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పర్యవేక్షణ గురించి వివరించారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించండి

శ్రీరంగరాజపురం: స్వస్థ నారి సశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఏఓ మోహన్‌మురళి పీహెచ్‌సీ వైద్యులకు సూచించారు. మండలంలోని కటికపల్లి సచివాలయం పరిధిలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, మండల వైద్యాధికారి డాక్టర్ బాలాజి చరణ్, రుతు శుభ్రత, సబ్ యూనిట్ అధికారి మోహన్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


కార్వేటినగరం: స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ ప్రారంభిస్తున్న డాక్టర్ భువనేశ్వరి

కార్వేటినగరం: దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కత్తెరపల్లి పీహెచ్‌సీ డాక్టర్ భువనేశ్వరి అన్నారు. మండల పరిధిలోని డీఎం పురం ఆయుష్మాన్ ఆరోగ్య భవనంలో బుధవారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ శిబిరంలో హైపర్ టెన్షన్, డయాబెటిక్, హెబీ స్క్రీనింగ్, నిశ్చయ ఐడీ, ఏన్‌సీ పరీక్షలు, టీబీ స్క్రీనింగ్, సికిల్ సెల్ అనీమియా పరీక్షలతో పాటు, క్యాన్సర్ స్క్రీనింగ్, బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించారు.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

నిండ్ర: బాలింతలు, కిషోర బాలికలు ప్రతినిత్యం విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ శ్యామల అన్నారు. బుధవారం మండలంలోని కావనూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ బాలింతలు, కిషోర బాలికలు ఆహారం తీసుకునే విధానాలు, పరిసరాల పరిశుభ్రత, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు.